క్లుప్తంగా

ఉల్లాసంగా ఫ్రెషర్స్ డే


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

చీరాల: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సబ్ ట్రెజరీ అధికారి డి.రమణారెడ్డి, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.స్నేహలత, వి.శేషుమాధవి, ఒన్‌టౌన్ మహిళా ఎస్సై జి.రాజ్యలక్ష్మి హాజరయ్యారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థినులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్.మురళి, వైస్ ప్రిన్సిపాల్ జి.రత్నపాప, అధ్యాపకులు పాల్గొన్నారు.

యాత్రికులకు అసౌకర్యం లేకుండా చూడాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

చీరాల: కార్తీక మాసం సందర్భంగా వాడరేవు, రామాపురం బీచ్‌కు సముద్ర స్నానాలకు వచ్చే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అధికారులను ఆదేశించారు. శనివారం రామాపురంలోని రివేరా రిసార్ట్స్‌లో పోలీసులకు, అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సముద్రస్నానాలకు వచ్చే యాత్రికులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రత్యేకించి అలలు ఎక్కువగా ఉన్నప్పుడు లోపలికి వెళ్ళకుండా చూడాలని, గజ ఈతగాళ్ళు, మెరైన్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని పోలీసులను ఆదేశించారు. ఇటీవల కాలంలో సముద్ర స్నానాలకు వచ్చిన పర్యాటకులు అలల తీవ్రత తెలియకుండా లోతైన ప్రాంతాలకు స్నానానికి వెళ్లి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. స్నానాలు చేస్తున్న వారిని నిత్యం గమనించాలన్నారు. ఏదైనా ఇబ్బంది గురైతే వెంటనే పోలీసు, మెరైన్, గజ ఈతగాళ్ళు అందుబాటులో ఉండాలన్నారు. ఆర్డీఓ చంద్రశేఖర్‌నాయుడు, డీఎస్పీ ఎండీ మొయిన్, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, అధికారులు పాల్గొన్నారు.


ఇంకొల్లు నాగండ్ల మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు మార్గం


టిప్పర్ల హోరుతో గుంతలమయమైన నాగండ్ల రోడ్డు


చక్కటి తారు రోడ్డును ఛిద్రం చేస్తున్న టిప్పర్లు

బాబోయ్.. ఆ రోడ్డా!

- కోలలపూడి- ఇంకొల్లు మధ్య ప్రమాదభరితంగా మారిన రోడ్డు
- భారీ వాహనాల రాకపోకలతో ప్రతి నిత్యం ప్రమాదాలు
- యథేచ్ఛగా అక్రమ మైనింగ్ రవాణా

పర్చూరు(చినగంజాం):

పర్చూరు నియోజక వర్గ పరిధిలో రోడ్లు నరక మార్గాలుగా మారాయి. రోడ్ల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తుండటంతో అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నాయి. ఇంకొల్లు నుంచి కోలలపూడి రోడ్డు ప్రమాద భరితంగా మారింది. ముఖ్యంగా ఇదే మార్గంలో ఉన్న మార్టూరు మండలం కోలలపూడి నుంచి ఇంకొల్లు మండలంలోని నాగండ్ల, సూదివారిపాలెం, పావులూరు, ఇంకొల్లు వరకు ప్రమాదకరంగా మారింది. ప్రశాంతతకు మారుపేరుగా నిలవాల్సిన గ్రామీణ ప్రాంతాల్లో అక్రమమైనింగ్ ద్వారా గ్రావెల్ తోలకం నిరాటంకంగా సాగుతోంది. భారీ వాహనాల రాకపోకలతో రోడ్లపై ట్రాఫిక్ విపరీతంగా పెరగడం, వాయు కాలుష్యం, రోడ్లు తీవ్రంగా ఛిద్రమై భారీ గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులకు కష్టాలతో పాటు ప్రాణ నష్టం కూడా సంభవిస్తోంది.

జిల్లా పరిషత్ పరిధిలో..

ఇంకొల్లు మండలంలోని పావులూరు నుంచి నాగండ్ల మీదుగా కోలలపూడి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డంతా గుంతలమయమై, రోడ్డుకి ఇరువైపులా చిల్లచెట్లు పెరిగాయి. వ్యవసాయ పనులు చేసుకునే రైతులకు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనదారులకు, ప్రయాణికులకు రోడ్డు ఇబ్బందిగా మారింది. సుమారు పదేళ్ళ క్రితం వేసిన రోడ్డు.. భారీ వాహనాల పుణ్యమా అని పూర్తిగా దెబ్బతింది. పావులూరు నాగండ్ల గ్రామాల మధ్య సుమారు 5 కి.మీ పొడవు రోడ్డు జిల్లా పరిషత్ పరిధిలోనిది కావడంతో నిర్వహణ లేక గుంతలమయమై రాళ్లు లేచి, రోడ్డు మార్జిన్‌లు దెబ్బతిన్నాయి. రోడ్డంతా కుంచించుకు పోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎదురెదురు వాహనాలు ఢీ కొనే పరిస్థితిలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.


భారీ వాహనాల రాకపోకలతో దెబ్బతిన్న రోడ్డు

మూడు మండలాల ప్రధాన రోడ్డు మార్గం

పర్చూరు నియోజక వర్గ పరిధిలోని కారంచేడు, ఇంకొల్లు, మార్టూరు మండలాల్లోని గ్రామాలను కలుపుకుంటూ జాతీయ రహదారిలో కలిసే సౌకర్యవంతమైన మార్గం ఒకప్పుడు గ్రాండ్ ట్రంక్ రోడ్డుగా పిలిచేవారు. ప్రస్తుతం ఈ రోడ్డు గుంతలమయమై అతీగతీ లేక అధ్వానంగా మారింది. కారంచేడు మండలంలోని దగ్గుబాడు నుంచి మొదలై ఇంకొల్లుమీదుగా పలు గ్రామాలను కలుపుకుంటూ మార్టూరు మండలంలోని కోలలపూడి వరకు ఈ మార్గం ఉంది. గతంలో ప్రజలు, రోటరీ క్లబ్ నిధుల సాయంతో మరమ్మతులు చేసుకున్నప్పటికీ భారీ లారీలు, వాహనాలు, టిప్పర్‌లు, భారీ క్రేన్‌లు, జేసీబీలులతో పాటు సీజన్‌లో దుక్కి యంత్రాలు నడుస్తుండటంతో ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా ఫలితం లేకుండా పోతోంది. దాంతో ఆర్టీసీ సైతం ఈ మార్గంలో బస్సు సౌకర్యాన్ని తగ్గించి వేసింది. ఇదే విధంగా కొనసాగితే మరో కొద్ది నెలల్లో రాకపోకలు పూర్తిగా ఆగిపోక తప్పేలా లేదు.

జాతీయ రహదారికి అనుసంధానిస్తే..

కారంచేడు మండలంలోని దగ్గుబాడు నుంచి ఇంకొల్లు వరకు, పాత మద్రాస్ రోడ్డు మొదలుకొని ఇంకొల్లు నుంచి పావులూరు, సూదివారిపాలెం అడ్డరోడ్డు వరకు 5 కి. మీ పొడవు ఉన్న రోడ్డును ఏర్పాటు చేస్తే చుట్టు పక్కల గ్రామాలకు రాకపోకలు మెరుగు పడేందుకు పూర్తి అవకాశం కలుగుతుంది. పావులూరు నుంచి కోలలపూడి వరకు రోడ్డును మెరుగు పరచి జాతీయ రహదారికి అనుసంధానం చేసినట్లయితే ఇంకొల్లు మండలంలోని ఎక్కువ గ్రామాలతో పాటు కారంచేడు, మార్టూరు మండలంలోని గ్రామాలకు ఎంతో మేలు జరుగుతుంది. ఇంకొల్లు నుంచి పావులూరు 3 కి.మీలు.. అక్కడి నుంచి నాగండ్ల వరకు 5 కి.మీలు. అక్కడి నుంచి మార్టూరు మండలంలోని కోలలపూడి మీదుగా జాతీయ రహదారి వరకు 9 కి.మీలు వెరసి మొత్తం 17 కి.మీలు రోడ్డుకు మరమ్మతులు చేస్తే జాతీయరహదారికి మార్గం సుగమం అవుతుంది. ఇటీవల ప్రజలు ఎంఎల్ఏ ఏలూరి సాంబశివరావు దృష్టికి రోడ్డు విషయమై నెలకొన్న అసౌకర్యాన్ని గురించి వివరించారు.


కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్టీ సమన్వయకర్త కరణం వెంకటేష్‌బాబు

కోటి సంతకాలతో చైతన్యం కలిగించాలి

- ఈపూరుపాలెంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం
- హాజరైన కరణం వెంకటేష్ బాబు

చీరాల: పేద, మధ్యతరగతి వర్గాలకు వైద్య విద్య అందుబాటులోకి తెచ్చేందుకు నాడు వైఎస్సార్ సీపీ తీసుకువచ్చిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ బాబు అన్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా రచ్చబండ కార్యక్రమాన్ని చేపట్టింది. కార్యక్రమంలో భాగంగా శనివారం చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈపూరుపాలెంలోని నేతాజీ యూనియన్ కల్యాణ మండపం వద్ద కార్యక్రమాన్ని నిర్వహించగా పార్టీ నియోజకవర్గ పరిశీలకులు మోదుగుల బసవపున్నారెడ్డి హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా పేదలకు సైతం కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వం ఉచితంగా విద్యనందించడానికి మనబడి నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్ది విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించిందన్నారు. కానీ నేటి కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడానికి పూనుకోవడం కూటమి నాయకులకు పేదల పట్ల ఉన్న శ్రద్ధ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రైవేటీకరణ చేస్తే ఫీజులు కూడా అధికంగా ఉంటాయని, పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ ఉద్యమ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు చేస్తున్నారన్నారు. వార్డులు, గ్రామాల్లో కార్యక్రమాన్ని పూర్తి చేసి సంతకాలు చేసిన పత్రాలను జిల్లా కార్యాలయానికి పంపించనున్నట్లు తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో సంతకాలు చేసిన పత్రాలను గవర్నర్‌కు అందిస్తామని తెలిపారు. కోటి సంతకాలతో కూటమి ప్రభుత్వ నిర్ణయాలను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ స్పందించాలన్నారు. అలానే వేటపాలెం మండలం అక్కయ్యపాలెం పంచాయతీలోని లక్ష్మీపురం గ్రామంలో కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ సమన్వయకర్త కరణం వెంకటేష్‌బాబు గ్రామస్తులతో మాట్లాడారు. పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.


సంతకాలు చేస్తున్న ప్రజలు

పాలనలో కూటమి ప్రభుత్వం విఫలం


సంతకాలు చేయిస్తున్న దృశ్యం

బల్లికురవ: కూటమి ప్రభుత్వం పాలనలో ఘోరంగా విఫలం అయిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు ధ్వజమెత్తారు. శనివారం రాత్రి వైదనలో వైద్య కళాశాలలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల బ్రోచర్ ఆవిష్కరణతో సంతకాల సేకరణ చేపట్టారు. ప్రభుత్వం పేదలకు వైద్య విద్యను దూరం చేస్తూ పీపీపీ విధానాన్ని అమల్లోకి తెస్తోందని.. పాలన ప్రశ్నించే నాయకులు పత్రికల గొంతు నొక్కుతూ అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. ఇదంతా ప్రజలు గమనిస్తూనే ఉన్నారని ప్రైవేటీ కరణకు చెక్ పెట్టేందుకు గ్రామ గ్రామాన సంతకాల సేకరణ చేపట్టినట్లు కృష్ణబాబు వివరించారు. మండల యూత్, బీసీ సెల్, స్థానిక నేతలు మక్కెన రవిబాబు, ఏ. సతీష్, మేడా శివదుర్గా బొమ్మిశెట్టి బ్రహ్మయ్య, కాసా రాంబాబు, గుంజి దానయ్య పాల్గొన్నారు.


సంతకాల సేకరణ

మెడికల్ విద్యార్థులకు న్యాయం జరగాలి


కోటి సంతకాల సేకరణ ఫాంలను అందజేస్తున్న ఇన్‌చార్జ్ మధుసూదన రెడ్డి

ఇంకొల్లు(చినగంజాం): రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంతో మెడికల్ విద్యార్థులందరికీ న్యాయం జరగాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి అన్నారు. శనివారం పావులూరులోని ఆయన నివాసంలో ఇంకొల్లు మండల కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణతో ప్రభుత్వ విధానంలో మార్పు తేవాలని, మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించేలా చర్యలు తీసుకొనేలా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చిన్ని పూర్ణారావు, జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, పావులూరు పార్టీ కన్వీనర్ ములకా సుబ్బారెడ్డి, తాటిపర్తి చంద్రారెడ్డి, పులఖండం జయరాం రెడ్డి, మారెళ్ళ అజయ్, సింహాద్రి బ్రహ్మరెడ్డి, ఎంపీటీసీ చిట్టియ్య, ముప్పవరపు శ్రీరాములు, తలకాయల కోటి, తాటిపర్తి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల పాటలతో చైతన్యం

చీరాల రూరల్: ఘంటసాల తన దేశభక్తి గేయాలతో యువతలో చైతన్యం రగిలించాడని ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వర రెడ్డి అన్నారు. స్థానిక ఘంటసాల విగ్రహం వద్ద విగ్రహ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఘంటసాల బయోపిక్ సినిమా ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రెడ్డి మాట్లాడారు. పట్టణంలోని మోహన్ థియేటర్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు ఘంటసాల దిగ్రేట్ బయోపిక్ సినిమా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఘంటసాల సినిమా మామూలు సినిమా కాదని ప్రపంచంలోని కోట్లాది మంది ఆరాధించే ఒక మహా గాయకుని జీవిత గాథను చరిత్రగా ఒక సినిమాగా రూపొందించారని చెప్పారు. ఘంటసాల కేవలం సినిమాల్లో పాటలు పాడటమే కాదని స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 18 నెలలు జైలుశిక్షణ అనుభవించారనే ఘట్టాలు, పొట్టి శ్రీరాములు అంతిమ యాత్రలో పాల్గొన్నటువంటి ఘట్టాలు మన కళ్లకు కనిపించేవిధంగా రూపొందించారని చెప్పారు. అలానే ఎన్‌టీఆర్, ఏఎన్ఆర్ హయాంలో పదివేలకుపైగా పాటలుపాడి సినీ స్వర్ణ యుగాన్ని సృష్టించారని చెప్పారు. చీరాల, పరిసర మండలాలకు చెందిన ప్రజలు, ప్రజా సంఘాలు, ఐక్యవేదిక నాయకులు, మేధావులు ఘంటసాల సినిమాను తిలకించాలని ఆయన కోరారు. గాదె హరిహరరావు, ఎస్. యలమందారెడ్డి, పి. కనక మోహనరావు, ఎన్. దివ్య నారాయణమూర్తి, ఎ. వెంకట్రావు, పి. రోహియ, సిహెచ్. ఆంజనేయులు, జి. జేజిబాబు, డి. అంకయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యతో ఉత్తమ భవిత

చీరాల రూరల్: తల్లి దండ్రులకు దూరంగా ఉంటూ గురుకుల పాఠశాలల్లో చదువుకునే విద్యార్థినిలను కంటికి రెప్పలా చూసుకుంటూ వారికి నాణ్యమైన విద్యనందించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకట వాహిని సూచించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. భారత రాజ్యాంగం మనకు ప్రసాదించిన ఫలాలే ఈ గురుకుల పాఠశాలలని చెప్పారు. విద్యార్థినిలకు చక్కగా చదువునేర్పి వారిని తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులదేనని.. వారికి ఎటువంటి కష్టం రాకుండా చూసుకోవాలని సూచించారు. న్యాయవాది ఆసాది రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినిలు ఏవిధంగా.. చదువుకోవాలి వారి జీవనశైలిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వారి హక్కులను గురించి వివరించారు. ఒన్‌టౌన్ ఎస్సై రాజేశ్వరి మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని.. ఆకతాయిలు వేధింపులకు గురిచేసినట్లయితే తక్షణమే పాఠశాలకు, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం న్యాయమూర్తి వెంకట వాహిని పాఠశాలలోని రికార్డులను, వంటగది, వసతి గదులను పరిశీలించారు. భోజనం, కూరలు ఇతర సౌకర్యాలు సక్రమంగా అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి జి. స్నేహ, ప్రిన్సిపాల్ మాధవిలత, కోర్టు సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకట వాహిని

చెకుముకి ధ్యేయం శాస్త్రవేత్తల సృష్టి

వేటపాలెం: యువ సైంటిస్టులను తయారు చేయడమే చెకుముకి సైన్స్ ధ్యేయమని రాష్ట్ర జనవిజ్ఞాన వేదిక మాజీ ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు చెకుముకి ప్రతిభా పరీక్షలు శనివారం నిర్వహించారు. పాఠశాల దశ నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిసరాల అవగాహన పెంపొందిస్తూ, మూఢ నమమ్మకాలను, అపోహలను తొలగిస్తూ, యంగ్ సైంటిస్టులను తయారు చేయాలనే ఉద్దేశంలో చెకుముకి సైన్స్ సంబరాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చినగంజాం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాన్ని పాఠశాల హెచ్ఎం కె. శ్రీనివాసరెడ్డి, చినగంజాం మండల జన విజ్ఞాన వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. నరసింహారావు, సుబ్బారావు ఆవిష్కరించారు. సైన్సు ఉపాధ్యాయుడు ప్రసాదరావు, ఉదయభానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని 8 హైస్కూల్‌లో టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించగా సుమారు 400 మంది పాల్గొన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యు. చెంచయ్య, పి. సత్యనారాయణ, ఎస్‌కే మస్తాన్‌వలి పాల్గొన్నారు.

పర్చూరు(చినగంజాం): విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని చెరుకూరు ఎస్ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ అధ్యక్షుడు హనోక్ బెంజిమన్ అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు.

జీఎస్టీ తగ్గుదలతో వినియోగదారులకు మేలు

చీరాల: కేంద్ర ప్రభుత్వం పలు రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించడంతో ప్రజలకు ఎంతో మేలు చేకూరిందని విద్యుత్‌శాఖ డివిజన్ ఈఈ జాన్ థామస్ అన్నారు. శనివారం చీరాల డివిజన్ విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ వారోత్సవాల్లో భాగంగా చీరాల డివిజన్ కార్యాలయం నుంచి గడియార స్తంభం సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. గడియార స్తంభం సెంటర్ ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వలన విద్యుత్ ఉపకరణాలు ఖరీదు తగ్గిందని, దీంతో విద్యుత్ వినియోగదారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. డీఈఈ బి.హరిప్రసాదరావు, వేటపాలెం డీఈఈ పి.శ్రీనివాసరావు, ఏఈలు, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి

ఇంకొల్లు(చినగంజాం): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్ అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కలిగించారు.

ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవాడికి చేరాలి

ఇంకొల్లు(చినగంజాం): ప్రభుత్వం నిర్దేశించిన పథకాలు ప్రతి పేదవాడికి చేరాలని ఎంపీడీఓ జి. శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం భవనంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

15 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

చినగంజాం: మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన 15 టీడీపీ కుటుంబాలు శనివారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. పర్చూరు నియోజక వర్గ పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి సమక్షంలో వారు పార్టీలో చేరగా ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కాపులు, పెద్దలు, మహిళలు, యువకులు ఐకమత్యంగా ఉండి వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో తప్పనిసరిగా అందరూ వైఎస్సార్ సీపీ విజయానికి భాగస్వాములు కావాలని బ్రహ్మానందరెడ్డి అన్నారు. మాజీ సర్పంచ్ బక్కా వెంకటేశ్వరరెడ్డి, మొలకారెడ్డి, బొడ్డు శ్రీనివాసరెడ్డి, బొడ్డు కృష్ణ, రమణారెడ్డి, హేమంత్‌కుమార్ రెడ్డి, రవీంద్రరెడ్డి, రఘు, రమేష్ రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీలో చేరుతున్న కొత్తపాలెం గ్రామంలోని పలు కుటుంబాలు

పలు కేసుల్లో జరిమానాలు

అద్దంకి రూరల్: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురు వ్యక్తులను, మండలంలోని వెంపరాల గ్రామంలో పేకాట ఆడుతూ పట్టుబడ్డ 6గురిని అద్దంకి సీఐ సుబ్బరాజు శనివారం అద్దంకి కోర్టుకు హాజరుపరిచారు. న్యాయమూర్తి బి. అఖిల మద్యం తాగి వాహనం నడుపుతున్న ఓ వ్యక్తికి రూ. 4వేలు, మిగిలిన వారికి రూ.3 వేలు, పేకాటాడిన వ్యక్తులకు రూ. 300 చొప్పున జరిమాన విధించినట్లు సీఐ తెలిపారు.

రాజ్యాంగం అమల్లో వివక్ష తగదు

చీరాల రూరల్: అంబేడ్కర్ తన మేధో శక్తితో రాసిన పటిష్టమైన భారత రాజ్యాంగాన్ని అమలు చేయడంలో పాలకులు వివక్ష చూపుతున్నారని ప్రజావేదిక ఐక్య క్రిష్టియన్ జేఏసీ వ్యవస్థాపకులు గుమ్మడి ఏసురత్నం అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో శనివారం ప్రజావేదిక ఐక్య క్రిష్టియన్ జేఏసీ గెట్‌టుగెదర్ కార్యక్రమాన్ని ఏసురత్నం అధ్యక్షతన నిర్వహించారు.

కొత్తపాలెం కల నెరవేరిన వేళ..


వీధి దీపాలు ప్రారంభిస్తున్న సర్పంచ్ ఆసోది బ్రహ్మానంద రెడ్డి

చినగంజాం: కొత్తపాలెం గ్రామ ప్రజల దశాబ్దాల కల నెరవేరిందని గ్రామ సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామ పంచాయతీ కొత్తపాలెం గ్రామంలో రూ. 5 లక్షలతో ఏర్పాటు చేసిన వీధి స్తంభాలు, వీధి లైట్లు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపాలెం గ్రామంలో దశాబ్దాలుగా వీధి లైట్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గ్రామ ప్రజల ఇబ్బందులను చూసి వీధి స్తంభాలు ఏర్పాటు చేసి, వీధి లైట్లు అమర్చినట్లు తెలిపారు. అక్కల రవీంద్రరెడ్డి, రఘురామరెడ్డి, హేమంత్‌కుమార్ రెడ్డి, సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ బక్కా వెంకటేశ్వరరెడ్డి, బొడ్డు శ్రీనివాసరెడ్డి, మొలకా రెడ్డి, బొడ్డు కృష్ణ, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.